సాక్షి నాగర్‌కర్నూల్

సోమవారం । 10 । ఫిబ్రవరి । 2025



డిజిటల్ హంగులు

సాంకేతిక టెక్నాలజీని ఉపయోగించి పక్కాగా ఆస్తుల రికార్డులను తయారు చేయనున్నారు.

వివరాలు 8లో ▸



హంసవాహన సేవ

మన్యంకొండ వేంకటేశ్వరస్వామి ఆదివారం హంసవాహనంపై దర్శనమిచ్చారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.3 /16.0

చల్లని గాలులు వీయడంతోపాటు మంచు కురుస్తుంది. రాత్రి చలి ఎక్కువగా ఉంటుంది. ఎండ ప్రభావం చూపిస్తుంది.

న్యూస్‌రీల్

అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుదాం



కల్వకుర్తి టౌన్: నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు ముఖ్యమంత్రి చొరవతో ముందుకెళ్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పీసీబీ మెంబర్ బాలాజీసింగ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత రోడ్లను ఆధునీకరించేందుకు గాను కల్వకుర్తిని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గంలోని 7 మండలాల్లో కలిపి 296.14 కిలో మీటర్లు, 79 రోడ్లకు అనుమతులు వచ్చాయన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాలకు వేసే రోడ్లకు పైలెట్ ప్రాజెక్టు కింద అనుమతులు వచ్చినా.. 15 ఏళ్లపాటు వాటి నిర్వహణ రోడ్లు వేసిన ఏజెన్సీలే చూసుకునేలా దేశంలో ఎక్కడా లేని అవకాశం రాష్ట్రంలోని కల్వకుర్తికి దక్కిందన్నారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని, వారి ఉనికి కోసమే ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ జరిగిందని, అదే తరహాలో రైతు భరోసా అందిస్తామన్నారు. సమావేశంలో పీఏ ర్డీఈ బసవలింగం, నాయకులు ఆనంద్‌కుమార్, విజయ్‌కుమార్‌రెడ్డి, సంజీవ్‌యాదవ్, సురేందర్‌రెడ్డి, హన్మానాయక్ పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ తనిఖీ

కందనూలు: జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఆదివారం జిల్లావ్యాప్తంగా 43 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా.. 609 మంది విద్యార్థులకు గాను 591 మంది హాజరయ్యారు. జిల్లాకేంద్రం శివారులోని ఉయ్యాలవాడ మహాత్మగాంధీ జ్యోతిరావుపూలే గురుకుల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని డీఐఈఓ వెంకటరమణ తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు.

వేరుశనగ @ రూ.6,619



కల్వకుర్తి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం వేరుశనగ పంటకు గరిష్టంగా రూ.6,619, కనిష్టంగా రూ.4,001, సరాసరిగా రూ.5,869 ధర లభించింది. అలాగే కందులు క్వింటాల్ సరాసరిగా రూ.6,350 ధర పలికింది. మార్కెట్‌కు 2,558 క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి వచ్చినట్లు మార్కెట్ అధికారులు చెప్పారు.

దుందుభీ ఉండగా..
ఇసుక రీచ్ దండగ

దుందుభీ వాగు.. జిల్లా పరిధిలోని ఊర్కొండ మండలం గుడిగానిపల్లిలో ప్రవేశించి.. ఉప్పునుంతల మండలంలోని జప్తిసదగోడు వద్ద ముగుస్తుంది. ఈ మధ్యలో 48 కి.మీ., పారిన ఈ వాగును నమ్ముకొని ఎంతో మంది రైతులు (వానాకాలంలో ఒక్కసారి నిండుగా పారినా) ఎలాంటి ఇబ్బంది లేకుండా రెండు పంటలు పండించుకుంటారు.. అయితే ఈ వాగు రైతులకు మాత్రమే కాకుండా మరికొంత మంది అక్రమార్కులకు సైతం కాసుల పంట పండిస్తోంది. ప్రభుత్వ ఇసుక పాలసీ విధానం అమల్లోకి తీసుకువచ్చినా.. ‘దుందుభీ ఉండగా.. ఇసుక రీచ్ దండగ’ అన్న రీతిలో సాగుతోంది దందా. ఇందుకు కొందరు అధికారులు, మరికొందరు ప్రజాప్రతినిధులు లోపాయికారీగా సహకరిస్తూ దుందుభీని కొల్లగొడుతున్నారు.



ఉప్పునుంతల మండలం వద్ద దుందుభీ తీరంలో నిల్వచేసిన ఇసుక డంపులు

జిల్లాలోని వాగు తీరంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- ఉప్పునుంతల, తెలకపల్లి, తాడూరు, కల్వకుర్తి పరిధిలో జోరుగా దందా
- క్షేత్రస్థాయిలో అమలుకాని ప్రభుత్వ ఇసుక పాలసీ
- ప్రభుత్వ ఆదాయానికి రూ.లక్షల్లో భారీగా గండి
- మామూళ్ల మత్తులో అధికార యంత్రాంగం

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాలోని దుందుభీ వాగులో ఇసుక అక్రమ రవాణా జోరుగా కొనసాగుతోంది. జిల్లాలో ప్రభుత్వ ఇసుక వాహనం ద్వారా ప్రభుత్వ ఇసుక సరఫరాను మళ్లీ ప్రారంభించినప్పటికీ ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటం లేదు. తెలకపల్లి మండలంలోని నడిగడ్డ, రఘుపతిపేట, తాడూరు మండలం గోవిందాయిపల్లి, వంగూరు మండలం ఉల్పర, పోతిరెడ్డిపల్లి, ఉప్పునుంతల మండలం మొల్గర, పెద్దాపూర్, జప్తిసదగోడు శివారుల్లోని దుందుభీ తీరంలో ఇసుక అక్రమ రవాణా మూడు వాహనాలు.. ఆరు ట్రిప్పులుగా సాగుతోంది. అయితే శనివారం తాడూరు మండలం గోవిందాయిపల్లిలో ఇసుక అక్రమ రవాణాను గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇటీవల తెలకపల్లి మండలం గడ్డంపల్లిలోనూ ఇసుక అక్రమ రవాణా అడ్డుకోవాలని గ్రామస్తులు నిరసన తెలిపారు. జిల్లాలో పలుచోట్ల అక్రమ ఇసుక రవాణాపై తరుచుగా ఫిర్యాదులు వస్తున్నా, గ్రామస్తులు అడ్డుకోవడం, నిరసనలు వ్యక్తం చేస్తున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

10 వరకు రీచులు

జిల్లాలో ప్రవహిస్తున్న వాగులు, వంకలు, చెక్‌డ్యాంల వద్ద ఇసుక పుష్కలంగా లభిస్తోంది. జిల్లావ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణాను అరికట్టి ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చేందుకు మైనింగ్ శాఖ ఆధ్వర్యంలో 10 వరకు ఇసుక రీచులను గుర్తించారు. వీటిలో ప్రస్తుతం ఆరు రీచ్‌లను అందుబాటులోకి తెచ్చామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ఎక్కడా ఇసుక సేకరణ మొదలుకాలేదు. మొదట తెలకపల్లి మండలం నడిగడ్డ, వంగూరు మండలం డిండిచింతపల్లి, ఉల్పర, ఉప్పునుంతల మండలం జప్తిసదగోడు, మొల్గర, తిమ్మాజిపేట మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామాల పరిధిలో రీచ్‌లను ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో ఆర్డర్‌పై ప్రభుత్వమే ఇసుక సరఫరా చేసేందుకు ప్రభుత్వ ఇసుక వాహనాన్ని ఇటీవల మళ్లీ ప్రారంభించారు. అయితే ప్రభుత్వ సాండ్ టాక్సీ విధానం పకడ్బందీగా అమలుకావడం లేదు. జిల్లాలో ప్రభుత్వ ఇసుక రీచుల కంటే అక్రమార్కుల ద్వారానే ఎక్కువగా సరఫరా అవుతోంది. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ప్రభుత్వం ప్రారంభించిన ఇసుక పాలసీ పకడ్బందీగా అమలుకు నోచుకోకపోవడం, ఇందుకు సరిపడా సిబ్బంది లేకపోవడంతో జిల్లాలో డిమాండ్‌కు సరిపడా సరఫరా కావడం లేదు. దీంతో ఇసుక అవసరాల కోసం ఎక్కువగా అక్రమార్కులనే ఆశ్రయిస్తున్నారు.

అడ్డుకుంటే దాడులు..

జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను చాలాచోట్ల గ్రామస్తులు అడ్డుకుంటున్నారు. అయితే జిల్లాలో ఇసుక రవాణాకు పాల్పడుతున్న అక్రమార్కులు తమ దందాకు అడ్డువస్తే ఎంతకైనా తెగిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటున్న స్థానికులపై దాడులు చేస్తున్నారు. స్థానికులపై దాడులకు పాల్పడుతున్న ఇసుక మాఫియాపై పోలీసులు కేసులు పెట్టి చేతులు దులుపుకొంటున్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన కొందరు అధికారులు వారికి లోపాయికారిగా సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. గతేడాది ఇసుక అక్రమార్కులకు సహకరిస్తున్నారంటూ జిల్లాలోని బిజినేపల్లి, తెలకపల్లి, వంగూరు, ఉప్పునుంతల పోలీస్‌స్టేషన్ల పరిధిలో పనిచేస్తున్న ఎస్‌ఐలను మల్టీ జోన్ ఐజీ మూకుమ్మడిగా అటాచ్ చేయడం సంచలనమైంది. గతంలో బల్మూరు మండల శివారు అచ్చంపేట పట్టణం సమీపంలో తమకు మామూళ్లు ఇవ్వడం లేదన్న కారణంతో ఇసుక అక్రమార్కుడిపై పోలీసులే దాడికి పాల్పడిన ఘటన జిల్లాలో ఇసుక అక్రమ రవాణా తీరుకు అద్దం పడుతోంది.

దురుసుగా ప్రవర్తిస్తున్నారు..



దుందుభీ వాగు నుంచి మా గ్రామం గుండా అక్రమార్కులు నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే ఇష్టారీతిగా తవ్వకాలు జరుపుతున్నారు. గ్రామస్తులు అడ్డుకుంటే వారి పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారు. అధికారులు, పోలీసులు సైతం వారికే అండగా ఉంటున్నారు.

– జంగయ్య, గోవిందాయిపల్లి, తాడూరు మండలం

ఆన్‌లైన్ ద్వారా బుకింగ్..


జిల్లాలో ప్రభుత్వ ఇసుక రీచులను గుర్తించి ప్రభుత్వ ఇసుక వాహనం ద్వారా వినియోగదారులకు ఇసుకను సరఫరా చేస్తున్నాం. మీసేవలో ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకున్న వారికి అందిస్తున్నాం. అక్రమ ఇసుక రవాణాపై పోలీసు, రెవెన్యూ అధికారుల సహకారంతో చర్యలు తీసుకుంటాం.

– నాగచైతన్య, రాయల్టీ ఇన్‌స్పెక్టర్, మైనింగ్ శాఖ, నాగర్‌కర్నూల్

‘పరిషత్’కు సన్నద్ధం

జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల ఎన్నికలకు అధికారుల కసరత్తు

- బ్యాలెట్ పత్రాలు, బాక్సులు సిద్ధం చేసుకుంటున్న వైనం
- రేపు కొలిక్కి రానున్న జిల్లాలో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- 15న తుది జాబితా ప్రకటన
- గ్రామీణ ప్రాంతాల్లో రాజుకుంటున్న ఎన్నికల వేడి



మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు	ఇతరులు
6,59,338	3,29,863	3,29,454	21

జెడ్పీటీసీ స్థానాలు 20 | ఎంపీటీసీ స్థానాలు 214

అచ్చంపేట: మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఎన్నికల నిర్వహణపై పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఎప్పటికప్పుడు ఆదేశాలు అందుతున్నాయి. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, తుది ఓటరు జాబితా విడుదలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి శుక్రవారం ఆదేశాలు అందడంతో దీనిపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీల వారీగా బ్యాలెట్ పత్రాల ద్వారా, రాజకీయ పార్టీల గుర్తులతో ఎన్నికలు జరగనున్నాయి. దీనికోసం అధికారులు బ్యాలెట్ బాక్స్‌లను సైతం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ నెల 15 వరకు మొత్తం ప్రక్రియ పూర్తి చేసి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు కలెక్టర్ ద్వారా నివేదిక పంపించాల్సి ఉంటుంది. దీనికోసం జిల్లా పరిషత్‌లో ప్రత్యేకంగా ఎన్నికల విభాగం ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు.

ఓటరు జాబితా తయారు..

గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల కోసం ఇప్పటికే పంచాయతీల వారీగా ఓటరు జాబితా తయారు చేశారు. జిల్లాలో మొత్తం 6,59,338 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో 3,29,863 పురుషులు, 3,29,454 మహిళలు, 21 ఇతరులు ఉన్నారు. దీనిని ప్రామాణికంగా తీసుకుని అదనంగా వచ్చిన ఓటర్ల సంఖ్యను కలుపుకొని సోమవారం జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కోసం తుది ఓటరు జాబితాను సిద్ధం చేసి ప్రకటిస్తారు.

700 మందికి ఒకటి..

జిల్లాలోని 20 మండలాల్లో 20 జెడ్పీటీసీ, 212 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. వీటికి అనుగుణంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఎన్నికల కమిషన్ ఇచ్చిన నియమ, నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రం, అందులో ఉండాల్సిన బూత్‌ల సంఖ్యపై కసరత్తు చేస్తున్నారు. 2019 ఎంపీటీసీ ఎన్నికల్లో 600 మందికి ఒక బూత్ ఏర్పాటు చేయాలని నిబంధన ఉండేది. దీంతో జిల్లాలో 1,176 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. తాజాగా 700 మందికి ఒకటి ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో 30 వరకు బూత్‌లు తగ్గే అవకాశం ఉంది. ఇటీవల పంచాయతీ అధికారులు రూపొందించిన ఓటర్ల జాబితాను ప్రాదేశిక ఎన్నికలకు పరిగణలోకి తీసుకోనున్నారు. వాటిలో మార్పులుంటే సరిచేసి.. ఎంపీటీసీ స్థానాల వారీగా ఓటరు జాబితా రూపొందిస్తారు. సోమవారంలోగా ఆయా జాబితాలను ‘టీపోల్’ వెబ్‌సైట్‌లో ఉంచుతారు. అదేరోజు మండల పరిషత్ కార్యాలయాల్లో జాబితాలను ప్రదర్శిస్తారు. దాన్నే తుది జాబితాగా పరిగణిస్తారు.

తాజా షెడ్యూల్ ఇలా..

పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను మంగళవారం ఖరారు చేసి ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రదర్శిస్తారు. ఏమైనా అభ్యంతరాలుంటే అదే రోజు నుంచి 13వ తేదీ వరకు ఫిర్యాదులు స్వీకరిస్తారు. వీటిపై అదేరోజు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తారు. 14న ఫిర్యాదులు, అభ్యంతరాలు, సూచనలు పరిశీలించి అదే రోజు కలెక్టర్ అనుమతితో పరిష్కరిస్తారు. 15న కలెక్టర్ అనుమతితో పోలింగ్ కేంద్రాల తుది జాబితా విడుదల చేస్తారు.

గ్రామాల్లో ఎన్నికల వేడి

రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు కసరత్తు ప్రారంభించింది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల ఎన్నికలతోపాటు సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు వస్తుండటంతో గ్రామాల్లో ఎన్నికల వేడి రాజుకుంటోంది. వివిధ పార్టీల నుంచి అభ్యర్థిగా పోటీలో నిలిచేలా ఆశావహులు ప్రయత్నాలు మొదలుపెట్టడంతో ఎన్నికల వాతావరణం కనిపిస్తోంది. ఏ ఒకరిద్దరు కలిసినా స్థానిక సంస్థల ఎన్నికల గురించే మాట్లాడుకుంటున్నారు. పోటీలో ఉండే అభ్యర్థులు ఇప్పటి నుంచే బలం కూడగట్టుకునే ప్రయత్నం చేస్తూనే ప్రత్యర్థుల బలం అంచనాలు వేస్తున్నారు.

దృష్టిసారించాం..

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల గుర్తింపు, అభ్యంతరాల స్వీకరణ, తుది పోలింగ్ కేంద్రాల జాబితా ప్రదర్శన తదితర అంశాలపై దృష్టి సారించాం. ఎన్నికల కమిషన్ నుంచి వచ్చే ఉత్తర్వుల ప్రకారం ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం.

– దేవసహాయం, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)


పెరిగిన రెండు స్థానాలు

జిల్లాలో గతంలో 212 ఉండగా.. ప్రస్తుతం 214 ఎంపీటీసీ స్థానాలు ఉండనున్నాయి. గతంలో 7 పంచాయతీలను అచ్చంపేట మున్సిపాలిటీలో విలీనం చేశారు. తీవ్ర వ్యతిరేకత రావడంతో విలీనాన్ని రద్దు చేసినా అక్కడ ఎన్నికలు నిర్వహించలేదు. రద్దయినా ఆరు పంచాయతీలు అచ్చంపేట మండలంలోనూ, ఒకటి బల్మూర్ మండలంలో విలీనం చేశారు. ఈ పంచాయతీల పరిధిలో నడింపల్లి, పాలిశెట్టిపల్లి రెండు ఎంపీటీసీ స్థానాలు పెరగడం విశేషం.

ప్రణాళికతో ముందుకు..

ఇంటర్, ఎస్సెస్సీ విద్యార్థులకు మొదలైన పరీక్షల కాలం

- వచ్చేనెల 3 నుంచి ఇంటర్, 21 నుంచి ‘పది’ ఎగ్జామ్స్
- ఇప్పటికే ప్రారంభమైన ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్
- అధిక మార్కుల సాధనపై నిపుణుల సూచనలు
- పలు సబ్జెక్టులపై ఉపాధ్యాయుల కీలకాంశాలు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రస్తుతం పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షల కాలం మొదలైంది. మార్చి నెల 3 నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు ప్రారంభం కానుండగా.. ప్రస్తుతం వారికి ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగుతున్నాయి. అలాగే వచ్చే నెల 21 నుంచి ఎస్సెస్సీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా ఇంటర్ విద్యార్థులు 36,873 మంది, ఎస్సెస్సీ విద్యార్థులు 39,952 మంది ఉండగా.. వీరంతా సమయం వృథా చేయకుండా పుస్తకాలతో కుస్తీ పడుతూ ప్రిపరేషన్‌పై దృష్టిసారించారు. పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు సమయం తక్కువగా ఉండటంతో ప్రణాళికాబద్ధంగా చదవడం వల్ల ఉత్తీర్ణత కావడంతో పాటు మెరుగైన ర్యాంకు సాధించేందుకు అవకాశం ఉందని పలువురు ఉపాధ్యాయులు, నిపుణులు సూచిస్తున్నారు. రోజూ చదువుతున్న టైం టేబుల్, అలవాట్లు తదితర అంశాలపై దృష్టి సారిస్తే సులువుగా లక్ష్యాన్ని చేరవచ్చని పేర్కొంటున్నారు. ముఖ్యంగా విద్యార్థులు ఇబ్బందిగా భావించే గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లిష్ వంటి సబ్జెక్టులకు కొంత ఎక్కువ సమయం కేటాయిస్తూ చదివితే ఎక్కువ మార్కులు స్కోర్ చేసేందుకు ఆస్కారం ఉందని చెబుతున్నారు.

సమయపాలన ముఖ్యం..

ప్రస్తుతం పరీక్షలకు చాలా తక్కువ సమయం ఉండటంతో విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే వీలైనంత వరకు లక్ష్యాన్ని చేరుకునే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా సెల్‌ఫోన్, టీవీ, సినిమాలు వాటి జోలికి వెళ్లొద్దని, టూర్‌లు, పండగలు, హాలీడేస్‌కు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. 24 గంటలను సబ్జెక్టుల వారీగా విభజించి అన్నింటికీ సమానంగా సమయాన్ని కేటాయించాలని, కచ్చితంగా ప్రతి యూనిట్ కూడా రివిజన్ చేసుకోవాలని, మార్కులు తప్పనిసరిగా వచ్చే అంశాలపై ఎక్కువగా దృష్టి పెట్టాలని చెబుతున్నారు. చదువులో పడి నిద్రను నిర్లక్ష్యం చేయొద్దని, అలాగే తెల్లవారుజామున ఉదయం 5 గంటల్లోపే నిద్ర లేవడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయని పేర్కొంటున్నారు. చిత్రపటాలు, వివిధ ప్రశ్నలకు సమాధానాలు మైండ్ మ్యాపింగ్‌తో వివిధ షార్ట్‌కట్‌లు వినియోగిస్తే ఫలితాలు రాబట్టవచ్చని, సులువుగా మార్కులు వచ్చే అంశాలపై దృష్టిసారించాలని సూచిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇంటర్, పదో తరగతి విద్యార్థులు ఇలా..

జిల్లా	ఇంటర్మీడియట్	పదో తరగతి
మహబూబ్‌నగర్	8,392	12,765
జోగుళాంబ గద్వాల	8,643	7,589
నారాయణపేట	8,953	7,706
వనపర్తి	6,591	6,853
నాగర్‌కర్నూల్	4,294	5,039

ఒత్తిడిని జయించి..



ఇప్పుడు విద్యార్థులు కేటాయించే సమయం ఎంతో విలువైంది. గతంలో చదివిన అంశాలను రివిజన్ చేయాల్సిన అవసరం ఉంది. అందుకోసం వేగంగా చదవడం నేర్చుకోవాలి. చదివిన అంశాలను ఖాళీగా ఉన్నప్పుడు పునరుశ్చరణ చేయాలి. మర్చిపోతామని భావిస్తే ముఖ్యమైన అంశాలను నోట్ చేసుకొని మరోసారి చదవాలి. ఎంత చదివామన్నది ఎంత ముఖ్యమో.. ఎంత గుర్తుకు ఉందనేది కూడా అంతే. ప్రస్తుతం ఉన్న సమయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు టైం టేబుల్ ప్రకారం చదవాలి. అనవసరమైన విషయాల జోలికి వెళ్లి.. సమయాన్ని, ఆలోచనలను పాడు చేసుకోవద్దు. ఇప్పుడు ఉన్న సమయం జీవితాన్ని నిర్దేశిస్తుంది.

– జంగం విశ్వనాథ్, సైకాలజీ అధ్యాపకులు, పీయూ


భయపడొద్దు..



పరీక్షలకు తక్కువ సమ యం ఉంది. ఈ క్రమంలో విద్యార్థులు ఫిజికల్ సైన్స్‌లో చాప్టర్ 1, 3, 4, 5 నుంచి లాంగ్ క్వశ్చన్స్ వచ్చే అవకాశం ఉంది. ఇందులో ప్రయోగశాల కృత్యాలు, కిరణ చిత్రా లు, ప్రతిబింబ లక్షణాలు, ఇంద్రధనస్సు ఏర్పడే విధానం, ఆమ్లాలు– క్షారాలు, పీరియాడిక్ టేబు ల్, పీహెచ్ విలువలు, క్వాంటమ్ సంఖ్యలు తది తర వాటి నుంచి తప్పకుండా ప్రశ్నలు వస్తాయి. ఇప్పటి నుంచి ఈ ప్రశ్నలపై దృష్టిపెడితే మంచి మార్కులు వచ్చేందుకు ఆస్కారం ఉంది. విద్యార్థులు ఫిజికల్ సైన్స్ అంటే భయపడాల్సిన పనిలేదు. కొద్దిగా శ్రద్ధపెడితే ఆడుతూ.. పాడుతూ చదువుకోవచ్చు.

– వెంకటస్వామి, ఎస్‌ఏ ఫిజికల్ సైన్స్, టీడీగుట్ట, మహబూబ్‌నగర్


గణితం.. సులువుగా



విద్యార్థులు పరీక్షలో దత్తాంశం రాస్తే మార్కులు వేస్తారు. 3, 4, 14వ అధ్యాయం నుంచి గ్రాఫ్‌లు వస్తాయి. 8, 9 అధ్యాయం నుంచి నిర్మాణాలు నేర్చుకుంటే తప్పకుండా 12 మార్కులు సాధించవచ్చు. 6, 10, 4 చాప్టర్ నుంచి సూత్రాలు ప్రాక్టీస్ చేయాలి. సమితులు, వెన్ చిత్రాలు, త్రికోణమితి, అనువర్తాలు, పటాలు గీయడం నేర్చుకోవాలి. గతంలో వచ్చిన ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేస్తే పాస్ కావడంతో పాటు మంచి స్కోర్ సాధించేందుకు అవకాశం ఉంది. గణితం అంటే భయపడాల్సిన పనిలేదు. ప్రణాళికబద్ధంగా ప్రాక్టీస్ చేస్తే సులువుగా మార్కులు రాబట్టవచ్చు.

– ఫసియొద్దీన్, ఎస్‌ఏ మ్యాథ్స్, మోడల్ బేసిక్ స్కూల్, మహబూబ్‌నగర్

గిరిజనులకు రాజకీయ శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా చైర్మన్ లింగంనాయక్

నాగర్‌కర్నూల్ క్రైం: ఆదివాసీ గిరిజనులు రాజకీయంగా రాణించేందుకు బుధవారం నుంచి శుక్రవారం వరకు కొల్లాపూర్ మండలం సోమశిలలో ఆదివాసీ గిరిజనుల రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా చైర్మన్ లింగంనాయక్ తెలిపారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అట్టడుగు వర్గాలను రాజకీయంగా అభివృద్ధి పర్చేందుకు రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు ఆదివాసీ గిరిజనులకు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించి చైతన్యపరుస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రతి మండలం నుంచి 5 మంది చొప్పున రాజకీయ శిక్షణ తరగతులకు ఎంపిక చేశామన్నారు. శిక్షణ తరగతులకు ప్రతిఒక్కరు హాజరై విజయవంతం చేయాలని, జిల్లాకు సంబంధించిన మంత్రి జూపల్లి కృష్ణారావుతోపాటు ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు. సమావేశంలో ఆదివాసీ కాంగ్రెస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు హన్మంత్‌నాయక్, నాయకులు నర్సింగ్‌నాయక్, కృష్ణనాయక్, శ్రీనివాస్, అనిల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కోస్గిలో రైతు దీక్ష

కోస్గి రూరల్: రైతు సమస్యలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం కోస్గిలో రైతు దీక్ష చేపట్టనున్నట్లు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కోస్గిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల హామీలను అమలుపర్చడంలో పూర్తిగా విఫలమైందని, రైతు రుణమాఫీ, పెట్టుబడి సాయం అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్‌కార్డులు ఇవ్వకుండా ప్రజలను మోసగిస్తుందని ఆరోపించారు. రైతులు, ప్రజల తరఫున పోరాటం చేసేందుకు కేటీఆర్ నిరసన దీక్ష చేపట్టనున్నారని అన్నారు. ఈ దీక్షకు మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డితో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లా తాజా, మాజీ ఎమ్మెల్యేలు హాజరు కానున్నారని అన్నారు. ఈ సభకు భారీ ఎత్తున ప్రజలు తరలిరావాలని కోరారు.



విద్యుత్ దీప కాంతులతో ముఖద్వారం



హంస వాహనంపై ఉత్సవమూర్తులు



విద్యుత్ దీప కాంతుల్లో స్వామివారి ప్రధాన ఆలయం

మన్యం‘కొండంత’ వెలుగు

మహబూబ్‌నగర్ రూరల్: ఉమ్మడి పాలమూరు జిల్లాలో పేదల తిరుపతిగా పేరుగాంచిన మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో స్వామివారి ముఖ ద్వారం నుంచి ఆలయం వరకు ఏర్పాటుచేసిన విద్యుద్దీపాలతో మన్యంకొండ దేదీప్యమానంగా వెలుగొందుతోంది. ప్రధాన ఆలయంతో పాటు ముఖద్వారం, స్టేజీ నుంచి గుట్టపై వరకు దారి పొడవునా రంగురంగుల బల్బులతో అలంకరించడంతో ఆ ప్రాంతామంతా జిగేల్‌మంటోంది.



ఆలయ మెట్ల దారి మీదుగా స్వామివారి ఊరేగింపు

హంసవాహనంపై వెంకన్నస్వామి

ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామి వారికి హంసవాహన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన హంస వాహనంపై వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను గర్భగుడి నుంచి దేవస్థానం ముందున్న మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. బంగారు ఆభరణాలు, రకరకాల పూల అలంకరణల మధ్య స్వామివార్లు హంసవాహనంపై ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. అనంతరం స్వామివారిని గర్భగుడిలోకి తీసుకెళ్లి అభిషేకాలు, అర్చనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారితో పాటు పాలక మండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

నవాబుపేట: చేపల వేటకు వెళ్లి వల కాళ్లకు చుట్టుకోవడంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని చౌడూర్‌లో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. చౌడూర్‌కు చెందిన పిట్ల రమేష్(37) ఆదివారం గ్రామ శివారులోని పెద్ద చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి చెరువులో వలస వేశాడు. అయితే కాళ్లకు చేపల వల చుట్టుకోవటంతో నీటిలో మునిగి మృతిచెందాడు. ఈ విషయం గమనించిన స్థానికులు రమేష్ కుటుంబసభ్యులకు సమాచారం అందించగా.. గ్రామస్తులు వచ్చి మృతదేహాన్ని బయ టికి తీశారు. భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

నీటి గుంతలో పడి చిన్నారి..



రుద్రరాజు మృతదేహం

పాన్‌గల్: నీటి గుంతలో పడి ఓ చిన్నారి మృతిచెందిన ఘటన మండలంలోని మాధవరావుపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు, గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నందిని, వినోద్ కుమారుడు రుద్రరాజు(2) ఆదివారం సాయంత్రం చుట్టుపక్కల పిల్లలతో కలిసి ఆడుకుంటూ పక్క ఇంట్లో ఉన్న నీటి గుంతలో పడిపోయాడు. ఈ విషయాన్ని తోటి పిల్లలు కుటుంబ సభ్యులకు తెలియడంతో వెంటనే వారు వచ్చి చిన్నారిని బయటకు తీసి చికిత్స నిమిత్తం వనపర్తి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. చిన్నారి మృతితో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

వ్యక్తి బలవన్మరణం



పుట్ట మధు (ఫైల్)

నవాబుపేట: ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గురుకుంటలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పుట్టా మధు (34) పొలానికి వెళ్తున్నానని ఇంట్లోచెప్పి అదే దారిలో చెట్టుకు ఉరేసుకున్నాడు. అటుగా వెళ్తున్న వారు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి చూసేవరకు అప్పటికే మృతిచెందాడు. తల్లి పద్మమ్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాకేంద్రంలోని నల్లవెల్లి రోడ్డులో ఉన్న ఓ వస్త్ర దుకాణం ఎదుట ఆదివారం గుర్తుతెలియని 60 ఏళ్ల వృద్ధుడి మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని.. మరిన్ని వివరాలకు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

పాడుబడిన బావిలో..

మహబూబ్‌నగర్ క్రైం: పాడుపడిన బావిలో ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని మాచన్‌పల్లి గ్రామ శివారులో పల్లె లింగయ్యకు చెందిన నీరులేని బావిలో గుర్తుతెలియని మహిళ(30) మృతదేహం లభ్యం అయింది. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండటం వల్ల గుర్తించలేని విధంగా మారింది. మాచన్‌పల్లి పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్డీఎస్ కాల్వలో..

అయిజ: మండలంలోని ఉప్పల శివారులో ఆర్డీఎస్ కాల్వ వద్ద ఆదివారం రాత్రి గుర్తుతెలియని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఎస్‌ఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం.. కాల్వ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి అక్కడే పంచనామా, పోస్టుమార్టం నిర్వహించారు. వ్యక్తి వయసు సుమారు 45–50 ఏళ్ల మధ్య ఉంటుందని, ఎరుపు రంగు టీ షర్ట్, తెల్లని దావతి, ఫుల్ బనియన్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహం గొంతుకు ఉన్న ఎరుపు రంగు ధారానికి తాయత్తు ఉందని, ఎవరికైనా వివరాలు తెలిస్తే తమను సంప్రదించాలని కోరారు.

పట్టణీకరణకు డిజిటల్ హంగులు



డ్రోన్ సాయంతో జడ్చర్లలో సర్వే చేస్తున్న సిబ్బంది (ఫైల్)

పక్కాగా ఆస్తుల నమోదు సర్వే

- ఫైలెట్ ప్రాజెక్టు కింద జడ్చర్ల మున్సిపాలిటీ ఎంపిక
- నక్ష సర్వే కోసం గ్రౌండ్ కంట్రోల్ పాయింట్ల ఏర్పాటు
- 49 చోట్ల డీజీపీఎస్ ద్వారా ఎంపిక–మార్కింగ్ పనులు
- ఏరియల్, ఫీల్డ్ సర్వేకు త్వరలోనే రానున్న బృందాలు



డీజీపీఎస్ ద్వారా గాంధీనగర్‌లో గ్రౌండ్ లెవల్ పాయింట్ ఎంపిక

మహబూబ్‌నగర్ న్యూటౌన్/జడ్చర్ల టౌన్: సాంకేతిక టెక్నాలజీని ఉపయోగించి పక్కాగా ఆస్తుల రికార్డులను తయారు చేయనున్నారు. పట్టణీకరణకు డిజిటల్ హంగులను తీసుకురానున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల ఆస్తులను సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి శాటిలైట్‌తో అనుసంధానించేందుకు పకడ్బందీ చర్యలకు పూనుకుంది. ఆస్తుల పక్కా సమాచారాన్ని క్షణాల్లో అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. డైరెక్టర్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ పర్యవేక్షణలో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. రెవెన్యూ, సర్వే ల్యాండ్, మున్సిపల్ శాఖల సమన్వయంతో ఏరియల్ సర్వేతో పాటు క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి ఆస్తుల వివరాలను నమోదు చేయనున్నారు. రాబోయే రోజుల్లో పట్టణ ప్రాంతాల్లోని ప్రజల ఆస్తులకు పక్కాగా రికార్డులతో పాటు ఉపగ్రహ ఛాయా చిత్రాలు అందుబాటులోకి రానున్నాయి. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ల్యాండ్ రీసోర్సెస్ డిజిటల్ ఇండియా భూరికార్డుల కార్యక్రమంలో భాగంగా ‘జియో స్పేషియల్ నాలెడ్జి బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్’ పేరుతో మున్సిపాలిటీ సర్వే చేసేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. ఇందుకోసం ఆయాశాఖల అధికారులతో 18 బృందాలను ఏర్పాటు చేశారు. ఏరియల్ సర్వే, క్షేత్ర స్థాయి సర్వేలకు సంబంధించి మొదటి విడతగా నాలుగు బృందాలకు శిక్షణ ఇచ్చారు. ఒక ఏడాది పాటు ఈ సర్వే ప్రక్రియ కొనసాగనుంది. పైలెట్ ప్రాజెక్టు కింద దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాల్లో 150 మున్సిపాలిటీలను ఎంపిక చేయగా తెలంగాణ రాష్ట్రంలో 10 ఉన్నాయి. వాటిలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జడ్చర్ల ఒక్కటే ఉండటం విశేషం.

సర్వేలో ముందుగా ఏరియల్ సర్వే

రెవెన్యూ, ల్యాండ్ సర్వే, మున్సిపల్ శాఖల సమన్వయంతో చేపడుతున్న మున్సిపాలిటీ సర్వేలో ముందుగా ఏరియల్ సర్వే నిర్వహిస్తారు. మున్సిపాలిటీలో నమోదై ఉన్న ప్రజల ఆస్తులకు సంబంధించి అక్షాంశ, రేఖాంశాలను గుర్తిస్తారు. ప్రభుత్వ, దేవాదాయ, భూదాన్, తదితర రకాల భూములకు సంబంధించిన సర్వే నంబర్ల వారీగా హద్దులు నిర్ణయించనున్నారు. అనంతరం సర్వే బృందాలు క్షేత్ర స్థాయికి వెళ్లి అందుబాటులో ఉన్న మున్సిపల్ రికార్డుల్లోని వివరాల ప్రకారం ప్రజల ఆస్తులకు సంబంధించి కమర్షియల్, డొమెస్టిక్ వివరాలను సరి చూస్తూ భవనం అంతస్తులు, నాలా వివరాలు, సర్వే నంబర్లను నమోదు చేస్తూ ఇంటింటి సర్వే నిర్వహిస్తారు. ఆస్తికి సంబంధించి యాజమాని, విస్తీర్ణం, మల్టీ స్టోరేజ్ భవనమా, ఎన్ని అంతస్తులు ఉన్నాయి, లొకేషన్ మ్యాపింగ్‌తో పాటు పూర్తి వివరాలు నమోదు చేస్తారు. ప్రభుత్వ ఆస్తులైన రోడ్లు, పార్కులు, భవనాలు, నీటి ట్యాంకులు, పైప్‌లైన్‌లు వంటి వివరాలను సైతం సర్వే బృందాల సభ్యులు సేకరిస్తారు.

క్రయ, విక్రయాలు సులభతరం

కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఈ సర్వే ద్వారా మున్సిపాలిటీల్లో ఉన్న ప్రజల ఆస్తులకు పారదర్శకత రానుంది. తద్వారా క్రయ, విక్రయాలు సులభతరం కానున్నాయి. దీంతో పాటు ప్రజల ఆస్తులతో పాటు ప్రభుత్వ ఆస్తులు సైతం అన్యాక్రాంతం కాకుండా అరికట్టే వీలుంటుంది. డబుల్ రిజిస్ట్రేషన్లు కట్టడి చేసేందుకు ఈ సర్వే ఉపయోగపడనుంది.

గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లు గుర్తింపు



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన నక్ష పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లు గుర్తించారు. సర్వే ఆఫ్ ఇండియా, పురపాలిక, రెవెన్యూ, మున్సిపాలిటీలు నిర్వహిస్తున్న డిజిటల్ సర్వేతో అన్ని రికార్డులు డిజిటలైజ్ చేస్తారు. మున్సిపాలిటీలో సర్వే కోసం 18 బృందాలు త్వరలోనే రానున్నాయి. వారికి మా వంతు సహకారం అందిస్తాం.

– కిషన్‌రావు, ఏడీ సర్వేయర్, మహబూబ్‌నగర్

మున్సిపాలిటీకి ప్రయోజనం..

జడ్చర్ల మున్సిపాలిటీకి నక్షకు ఎంపిక కావటం ఎంతో ప్రయోజనకరం. మున్సిపాలిటీకి సంబంధించిన అన్ని ఆస్తుల వివరాలు లెక్కించి, వాటికి మ్యాప్‌లు ఇస్తూ డిజిటలైజ్ చేయటం వల్ల ఆస్తిపన్ను లెక్కింపు సులభమవుతుంది. ఇటీవల అమృత్ 2.0లోనూ డ్రోన్ సహాయంతో సర్వే పూర్తిచే శారు. ఆ వివరాలు అందాల్సి ఉంది.

– లక్ష్మారెడ్డి, కమిషనర్, జడ్చర్ల మున్సిపాలిటీ

మున్సిపాలిటీకి రానున్న 18 సర్వే బృందాలు


నక్ష పైలెట్ ప్రాజెక్టులో ఎంపికైన జడ్చర్ల మున్సిపాలిటీలో డిజిటలైజ్ సర్వే కోసం 49 గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లను గుర్తించారు. ఇందుకోసం ఏఆర్ అసోసియేట్ సంస్థకు చెందిన నలుగురు సభ్యులు మూడు రోజులపాటు మునిసిపాలిటీలో పర్యటించారు. మునిసిపాలిటీ కార్యాలయాన్ని బేస్ పాయింట్గా ఎంపిక చేసుకొని మిగిలిన 49 గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లను గుర్తించారు. శాటిలైట్ అనుసంధానం కలిగిన డీజీపీఎస్ సిస్టం ద్వారా వీటిని ఎంపిక చేశారు. మునిసిపాలిటీ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో శుక్ర, శని, ఆదివారాల్లో గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లను ఎంపిక చేసి మార్కింగ్ వేయడం పూర్తి చేశారు. ఒక పాయింట్ మధ్యలో అర కిలోమీటర్ నుంచి కిలోమీటర్ దూరం ఉండేలా ప్రణాళికలు రూపొందించారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 36 కిలోమీటర్ల మేర సర్వే జరగనుంది. సంస్థ సభ్యులు ఎంపిక చేసిన గ్రౌండ్ కంట్రోల్ పాయింట్ల ఆధారంగానే సర్వే కొనసాగనుంది. పది రోజుల్లో ఇందుకోసం 18 సర్వే బృందాలు మున్సిపాలిటీకి రానున్నాయి. డిసెంబర్ నెల మొదటి వారంలో అమృత్ 2.0 పథకంలో భాగంగా డ్రోన్ సహాయంతో మున్సిపాలిటీ హద్దులు, ఆస్తుల వివరాలు నమోదు చేసిన విషయం తెలిసిందే అయితే ఆ వివరాలు అందడానికి మరో ఆరు నెలల సమయం పట్టనుంది. 2.0తో పాటు నక్ష పథకంలో జడ్చర్ల మున్సిపాలిటీ ఎంపిక కావడంతో ఆస్తుల వివరాలు పక్కాగా తేలనుంది.

స్వయంభూగా మహాదేవుడు



ఆత్మకూర్‌లోని చెరువులో పరమేశ్వరస్వామి ఆలయం

- నేటి నుంచి పరమేశ్వరస్వామి జాతర
- మూడురోజులపాటు తేరు మహోత్సవం



స్వామివారి మూల విగ్రహం

ఆత్మకూర్: పట్టణంలోని చెరువులో స్వయంభూగా వెలసిన పరమేశ్వరస్వామి జాతర ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అలాగే మార్చి 1, 2, 3 తేదీల్లో రాత్రి 9 గంటలకు తేరు మహోత్సవం కనుల పండువగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి వారం రోజుల పాటు జాతరను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్నిరకాల ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. మూడు రోజులపాటు ప్రత్యేక పూజలతోపాటు పల్లకీసేవ, రథోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నామని ఆలయ కమిటీ చైర్మన్ వెంకటనర్సింహారావు, వైస్ చైర్మన్ యాదగిరిశెట్టి, ప్రధాన కార్యదర్శి సాయిరాఘవ, కోశాధికారి మణివర్ధన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి నాగేష్, మున్సిపల్ కమిషనర్ శశిధర్ తెలిపారు.

సంస్థానాధీశుల కాలంలో..

1560 సంవత్సరంలో వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన ఓ రైతుకు లింగం ఆకారంలో ఉన్న రాయి దొరికింది. అయితే సదరు రైతు ఆ రాయిని వ్యవసాయ పనులకు వినియోగించుకునేవారు. ఉదయం అయ్యే సరికి ఎక్కడో ఉన్న రాయి తిరిగి యథాస్థితికి వచ్చి ఉండేది. అనుమానం వచ్చిన ఆ రైతు ఒకరోజు రాత్రి సమయంలో మేల్కొని గమనించాడు. సాక్షాత్తు పరమేశ్వరుడు స్వయంభూగా ఇక్కడ వెలిసినట్లు గుర్తించి ఆ లింగాన్ని అక్కడే ప్రతిష్ఠించి పూజలు చేయడం ఆరంభించాడు. అనంతరం అప్పటి సంస్థానాధీశులు ఆలయాన్ని నిర్మించి మహాశివరాత్రి సందర్భంగా అమావాస్య అనంతరం జాతర జరపడం ప్రారంభించారు. ఆత్మకూర్ సంస్థానాధీశుల కాలం నుంచి పరమేశ్వరస్వామి జాతర ఉత్సవాలు గతంలో ఘనంగా నిర్వహించేవారు. కాలక్రమంలో అనివార్య కారణాలతో జాతర ఆదరణ కోల్పోయింది. దీంతో ఆత్మకూర్‌లో అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసి జాతరకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు పెద్ద ఎత్తున నిర్వాహకులు ఏర్పాట్లు చేపడుతున్నారు.

ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

మక్తల్: డీసీసీ బ్యాంకుల్లో రుణం తీసుకున్న రైతులు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి పాలమూరు డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కోరారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఓటీఎస్‌కు ఈ నెల 15 వరకు అవకాశం ఉందని.. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చన్నారు. రెన్యూవల్ చేసిన తర్వాత తిరిగి కొత్త రుణాలు మంజూరు చేస్తామని.. పొలం ఉంటే ఇల్లు నిర్మించుకునేందుకు రూ.15 లక్షలు, వ్యవసాయ రుణాలు రూ.పది లక్షల వరకు, రైతుల పిల్లల విదేశ విద్యకు రూ.35 లక్షల వరకు రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రెండు నెలల్లో రూ.200 కోట్ల రుణాలు మంజూరు చేశామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, రవికుమార్, చెన్నయ్యగౌడ్, గడ్డం రమేశ్, వేణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీరు

మదనాపురం: రామన్‌పాడు జలశయంలో ఆదివారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 24 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వల ద్వారా 60 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.

వ్యక్తిని హతమార్చి..

పాత ఎంపీడీఓ కార్యాలయంలో దహనం

- నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లిలో దారుణం



పాత ఎంపీడీఓ కార్యాలయంలో ఎగిసిపడుతున్న మంటలు

బిజినేపల్లి: గుర్తుతెలియని వ్యక్తి హతమార్చిన దుండగులు.. సదరు మృతదేహాన్ని ఏకంగా పాత ఎంపీడీఓ కార్యాలయంలో తగలబెట్టారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ, ఎన్నికలకు సంబంధించిన పాత సామగ్రిని తొలగించి, కొత్త సామగ్రి భద్రపరుచుకునేందుకు పాత ఎంపీడీఓ కార్యాలయాన్ని సిద్ధం చేసుకుంటున్నారు. ఇందుకోసం నెట్‌వర్క్ గదిని కూడా పరిశీలించారు. అయితే ఆదివారం మధ్యాహ్నం తర్వాత మంటలు వ్యాప్తి చెందడం గమనించిన స్థానికులు ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఆదివారం రాత్రి నష్టంపై నష్టంపై పంచనామా నిర్వహించారు. ఈ క్రమంలో నెట్‌వర్క్ గదిలో ఒక మృతదేహాన్ని గమనించారు. వెంటనే స్థానిక ఎస్‌ఐ శ్రీనివాసులు, నాగర్‌కర్నూల్ అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జ్ కృష్ణమూర్తిలకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గ్రామ పంచాయతీ సిబ్బంది ద్వారా వెలికి తీశారు. అనంతరం ఎస్‌ఐ శ్రీనివాసులు, సీఐ కనకయ్యగౌడ్ మృతదేహాన్ని ప్రాథమికంగా గమనించి 40– 45 ఏళ్ల వ్యక్తిగా గుర్తించారు. వ్యక్తి దాదాపు ఐదున్నర అడుగుల పొడవు ఉంటాడని అంచనా వేశారు. అనంతరం మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం సెలవు దినం కావడంతో మృతదేహాన్ని కార్యాలయంలోనే నిప్పంటించి దహనం చేస్తే నేరాన్ని గుర్తించడానికి సాధ్య కాదనే పథకం ప్రకారమే ఇలా చేసి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు.

- బిజినేపల్లిలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఏకంగా వ్యక్తిని హతమార్చి మండల పరిషత్ కార్యాలయంలోనే తగలబెట్టిన పరిస్థితి దాపురించిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చని స్థానికులు వాపోతున్నారు.

పంప్‌హౌస్, పవర్‌స్టేషన్ నిర్మాణాలు నిలిపివేయాలి



రైతులకు మద్దతు తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

దామరగిద్ద: నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా దామరగిద్దతండా, బాపన్‌పల్లి శివారులోని రైతుల పొలాల్లో చేపట్టే పంపుహౌస్, పవర్ స్టేషన్ నిర్మాణ పనులు వెంటనే నిలిపివేయాలని ఆయా గ్రామాల రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఆదివారం మండలంలోని దామరగిద్దతండాలో ఆయా గ్రామాల రైతులు సమావేశమవగా వారికి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుభాష్, సామాజిక కార్యకర్త గవినోళ్ల శ్రీనివాస్ అండగా నిలిచారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పేరపళ్ల జాయమ్మ చెరువు సమీపంలోని ప్రభుత్వ భూమిలో ఉన్న గుట్టపై పంపుహౌస్, పవర్‌స్టేషన్ నిర్మించాలన్నారు. రైతులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ప్రభుత్వం సర్వే చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని.. అభివృద్ధి పేరిట గిరిజన రైతులకు అన్యాయం చేయడం సరికాదని తెలిపారు. పైప్‌లైన్ నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులకు నష్ట పరిహారంతో పాటు మరోచోట ప్రభుత్వ భూమి చూపించేలా హామీ ఇవ్వాలని కోరారు. పంప్‌హౌస్, పవర్‌స్టేషన్ల నిర్మాణానికి 100 ఎకరాలు నష్టపోతే పేద రైతులను ఎవరు ఆదుకోవాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో రైతులు బాబునాయక్, వెంకట్‌నాయక్, రాజునాయక్, గుంజిల్యానాయక్, సిద్దూనాయక్ తదితరులు పాల్గొన్నారు.